క్లుప్తంగా

పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం



సర్పంచ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భరత్

యద్దనపూడి: వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని గురజాల నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గొట్టిపాటి భరత్ అన్నారు. సోమవారం రాత్రి పోలూరు గ్రామ సర్పంచ్ షేక్ మాబు సుభాని భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా భరత్ పార్టీ కండువా కప్పి సుభానిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పోలూరు నాయకులు వేముల సాంబయ్య, దొడ్డా సాంబయ్య, పీ శ్రీనివాసరావు, రావిపాటి వీరయ్య, పీ వెంకయ్య, గనిపిశెట్టి ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం రేపు

పర్చూరు (చినగంజాం): పర్చూరు చెంచుల కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఈనెల 14వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్, ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ, రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బీదమస్తాన్ రావు తదితరులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నిందితులను అరెస్టు చేయాలి

చీరాల: ఇటీవల జాండ్రపేట వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ప్రసన్నలక్ష్మి కేసులో అసలు ముద్దాయిలు అయిన కామంచి గోపి, మరొక ఇద్దరిని నేటికి అరెస్ట్ చేయాలేదని ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మా సోమవారం ఆరోపించారు. ఈ కేసులో ఎవరో ఇద్దరు అమాయకులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. శాంతి భద్రతలకు సంబంధించిన కేసును ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బడుగు విమలాకర్, కమలాకర్, లక్ష్మీప్రసాద్, దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కే సురేష్ వివరాల మేరకు.. కడవకుదురు గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను, ఇసుక తరలిస్తున్న బీ శ్రీనివాసరావును అదుపులోనికి కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు

బల్లికురవ: ప్రాధాన్యత భవనాలకు సంబంధించి 20 సచివాలయాల్లో పూర్తయిన పనులకు రూ.73 లక్షలు చెల్లింపులు పూర్తిచేశామని ఎంపీడీవో పేర్కొన్నారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాలలోని సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల్లో నగదు కాంట్రాక్టుల ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. ఈవోఆర్డీ సుమతి మాట్లాడుతూ వర్షాల సీజన్ ఆరంభమవుతున్నందున గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

లోవోల్టేజీ సమస్య తీర్చాలని నిరసన

బల్లికురవ: నెల రోజులుగా లోఓల్టేజీ సమస్యలతో విలవిల్లాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఉప్పుమాగులూరు గ్రామ వినియోగదారులు వాపోయారు. సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లోవోల్టేజీ నుంచి విముక్తితోపాటు గ్రామంలో కిందకు జారిన వైర్లను సరిచేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం: సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎన్‌పీటీఈఎల్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి మెడల్స్ సాధించారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. కళాశాల నుంచి ఈ పరీక్షల్లో 302 మంది ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందినట్లు ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఈ పరీక్షల్లో ఒకరు గోల్డ్ మెడల్ సాధించగా ఐదుగురు టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి షేక్ జమీర్ బాషా మూడు కోర్సుల్లో ప్రతిభ కనపర్చి టాపర్‌గా నిలిచి సూపర్ స్టార్ అవార్డును సాధించాడని తెలిపారు.



చీరాలలో విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సంతమాగులూరులో విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ



కొండమంజులూరులో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక

- మొదటి రోజే జగనన్న విద్యాకానుక
- మురిసిన విద్యార్థులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/జే.పంగులూరు/బల్లికురవ: చెప్పాడంటే.. చేస్తాడంతే ఇప్పుడు ప్రజల్లో నానుతున్న మాట. ' పిల్లల భవిష్యత్‌కు మనం ఇచ్చే ఆస్తి ఏదైనా ఉంటే అది చదువే' అని పలు సభల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిరునవ్వుతో చెప్పే మాటలు ఇవి. ఈనాలుగేళ్లలో కార్పొరేట్‌కు దీటుగా నాడు–నేడు, అమ్మఒడి, విద్యాకానుక వంటి పథకాలతో రూపురేఖలను మార్చేశాడు. పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు అందజేశారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని ధర్మవరం పాఠశాలలో ఎంపీపీ అవిశ జ్యోతి మాట్లాడుతూ జగన్ మామ అందించిన కానుకను తీసుకుని విద్యార్థులంతా బాగా చదవుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్స్, బెల్టు, బ్యాగ్‌లు అందజేశారు. దీనిలో భాగంగా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు బూదాటి సుధాకర్, చక్రాయపాలెం ఉన్నత పాఠశాలలో కేవీ శ్రీనివాసరావు, బొమ్మనంపాడు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసమూర్తి పంపిణీ చేశారు.

■ సంతమాగులూరులోని పాఠశాలలో విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ఎనుబర్ల ఎల్లమంద, అట్లా పెద్ద వెంకటరెడ్డి, సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ అంకమ్మరావు, ఎంఈవో కోటేశ్వరరావు గ్రామ పెద్దలు హాజరయ్యారు.

■ జే.పంగులూరు మండల పరిధిలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐ. అనిత ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిసిటీ కన్వీనర్, మాజీ ఏఎంసీ చైర్మన్, మాజీ ఎంపీపీ జంపాని రవి కార్యక్రమంలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన చదువును అందిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సురేష్, సుబ్బారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ జగనన్న విద్యాకానుక కిట్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కొరిశపాడు ఎస్సై జీవీ చౌదరి అన్నారు. మండల కేంద్రమైన కొరిశపాడులోని జగ్జీవన్‌నగర్ ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు సర్పంచ్ విజయకుమార్‌తో పాటు ఎస్సై విద్యాకానుకలను అందజేశారు. హెచ్‌ఎం మురళీకృష్ణ, శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

■ పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం ఓ వరమని బల్లికురవ ఎంఈవో బీ.వీరరాఘవయ్య చెన్నుపల్లి సర్పంచ్, ఎంపీటీసీలు ఈ శివపార్వతి, డీ.రాహేలు అన్నారు. కొత్త జమ్ముల మడక, కూకట్లపల్లి హెచ్‌సీ, అరుణగిరి, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి పాఠశాలలో విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. మార్టూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చెన్నుపల్లిలో విద్యా ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ బాధ్యుడు కే ఖాజారావు, జీ. శ్రీనివాసరావు, లక్షణరావు పాల్గొన్నారు.

విద్యా కానుక విద్యార్థులకు వరం..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: జగనన్న విద్యా కానుక ప్రతి విద్యార్థికి వరమని ఎంపీడీవో డీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేవీకే కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంపీ సత్యన్నారాయణ, హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, సర్పంచ్ మోటాని మధుసూదనరావు, పాఠశాల స్థల దాత రంగనాయకులు, చైర్మన్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

■ ఈఏడాది మంచి మార్కులు, ఫుల్ అటెండెన్స్, మంచి ప్రవర్తన ఆధారంగా ముగ్గురికి బహుమతులు అందిస్తామని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు అన్నారు. కారంచేడు యూపీలో జేవీకే కిట్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జేవీకే కిట్లు పంపిణీలో వైస్ ఎంపీపీ ఐనంపూడి వనజ, సర్పంచ్ కే మోహన్‌కృష్ణ, జయప్రకాష్ పాల్గొన్నారు.

■ మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ భూక్యా సునీతాబాయి, ఎంపీపీ భుక్యా శాంతిబాయిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి బాల బాలికలకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంసీహెచ్ వస్రాం నాయక్, హెచ్‌ఎం రూత్ మర్సీజాయ్, స్థానిక నాయకులు, రవిచంద్, సులేమాన్, గడ్డం మస్తాన్‌వలి, కాకోలు వెంకటేశ్వర్లు, మైలా నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం నిర్మల 700 మంది విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.

■ చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో హెచ్‌ఎం డీ రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించగా జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 100 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును ఆమె అందజేశారు. కారక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ నరసింహరావు, శ్రీనివాస దీక్షితులు పాల్గొన్నారు. మున్నవారిపాలెం ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ నల్లమోపు పద్మావతి, హెచ్‌ఎం ఎం మల్లారెడ్డి చేతుల మీదుగా కిట్లు అందజేశారు.

■ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో కిట్లు పంపిణీ చేయడం రాష్ట్ర విద్యా వ్యవస్థలోనే శుభపరిణామం అని ఇంకొల్లు ఎంపీపీ బండారు అనూష అన్నారు. ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్‌లో కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం టీ మోహనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ టీ చలమయ్య, పేరెంట్ కమిటీ చైర్మన్ కే మల్లిఖార్జున్,కే పద్మావతి, పాఠశాల సిబ్బంది, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

■ యద్దనపూడి మండలం జాగర్లమూడి ఏఎస్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మ అమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మానుకొండ శ్రీనివాసరావు, హెచ్‌ఎం బెల్లం శ్రీనివాసరావు, గన్నవరంలో ఎంఈవో పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీ అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్, కమిటీ చైర్మన్ జాలయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం శివలింగారావు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకతో మురిసిన విద్యార్థులు..

చీరాల అర్బన్/వేటపాలెం: సీఎం జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న జగనన్న విద్యాకానుకల కిట్లను పాఠశాల మొదటి రోజునే అందుకుని మురిసిపోయారు. పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సాల్మన్ రాజు, వార్డు కౌన్సిలర్ మల్లెల లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లెల రాజశేఖర్, శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు కానులను అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ఉపాధ్యాయులు గాంధీ, చంద్ర, ప్రసన్నకుమార్, వెలుగొండారెడ్డి, కృష్ణమోహన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

■ విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషి అసామాన్యమైనదని జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 6,627 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.



కొరిశపాడులో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఎస్సై, నాయకులు



చినగంజాంలో కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి



ఇంకొల్లులో జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులతో ఎంపీపీ అనూష, ఉపాధ్యాయులు



స్వర్ణలో జేవీకే కిట్లు అందిస్తున్న ఎంపీడీవో, ఎంఈఓ



మార్టూరులో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీపీ



బల్లికురవ: జగనన్న విద్యార్థులకు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు



వేటపాలెంలో జేవికే కిట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ తిరుమలాదేవి



యద్దనపూడిలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న అమ్మిరెడ్డి

కుందేరు సమస్యకు పరిష్కారం




కుందేరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

- ఆధునికీకరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కరణం

చీరాల: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కుందేరు కాలువ అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. కుందేరు కాలువ ఆధునికీకరణ పనులను సోమవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ప్రారంభించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని కాలువ పనులను ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పట్టణంలో అభివృద్ధి పనులను ఒక ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న కుందేరు ఆధునికీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. కాలువ అభివృద్ధికి రూ.12 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈపూరుపాలెం నుంచి వేటపాలెం వరకు ఉన్న కుందేరు కాలువ మొత్తం చిల్లచెట్లు, గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. పట్టణంలో వర్షాలు పడిన సమయంలో వరదనీరు కుందేరులోకి వెళ్లేందుకు వీలుగా కాలువను ఏర్పాటు చేశారన్నారు. కుందేరులో పూడిక పెరిగిపోవడం వలన తరచూ ఇబ్బందులు పడుతున్నామని, అభివృద్ధి చేపట్టాలని ప్రజలు వినతిపత్రాలు అందించారన్నారు. కాలువకు శాశ్వత పరిష్కారం అందించేందుకు డ్రోన్ల సాయంతో వీటిపై రసాయనాలు పిచికారీ చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అలానే చీరాల–కొత్తపేట మధ్య కోర్టు రోడ్డు నుంచి వాడరేవు వెళ్లే రహదారిలో ఉన్న కుందేరు వద్ద అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, విద్యుత్‌శాఖ డీఈ సూర్యప్రకాశరావు, నీటిపారుదల శాఖ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కల వారిపాలెం గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పరాశం భోగశ్రీనివాస మారుతి వరప్రసాద్ భట్టాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రావి రామనాథం బాబులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారివురిని విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్న ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంక్షేమం, అభివృద్ధి జగనన్న ధ్యేయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం మండలంలోని పాతమాగులూరు సచివాలయ పరిధిలోని పుట్టావారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. జగనన్నకు ప్రజల్లో విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్పొరేషన్ డైరక్టర్, సొసైటీ అధ్యక్షుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

యద్దనపూడి: యనమదల జైభీమ్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగియడంతో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి చెన్నై జట్టు, రెండో బహుమతి నెల్లూరు జట్టు, మూడో బహుమతి బాపట్ల జట్టు గెలుచుకోగా వారికి బహుమతులు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో యనమదల వైఎస్సార్ సీపీ నాయకులు మార్నెళ్ల శ్రీధర్, సర్పంచ్ రాయి పృథ్వీరాజ్, అంబేడ్కర్ యూత్ సభ్యులు పెదబాబు, ఏసుబాబు, ప్రసాద్, తిమోతి, ఏసోబు, సభ్యులు పాల్గొన్నారు.

దక్కలి కుల హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక



నూతనంగా ఎంపికైన దక్కలి హక్కుల పోరాట కమిటీ

మార్టూరు: రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల్లో 17వ స్థానంలో ఉండి మాదిగ అనుబంధ కులంగా ఉన్న దక్కలి కుల హక్కుల పోరాట సమితి బాపట్ల జిల్లా కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దగౌరవరపు యలమంద తెలిపారు. స్థానిక ఆదిజాంబవ కాలనీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా వేశపోగు రామయ్య, ఉపాధ్యక్షుడిగా చిన్నకర్నెబాబు, కార్యదర్శిగా పెద్ద గౌరవరపు దానియేలు, పెద్ద గౌరవరపు జాన్, కోశాధికారిగా చిన్నకర్ని ఏలేష్, తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యకమంలో గర్నెపూడి రవిచంద్, రాజా నాయక్, బాబులు నాయక్, కాకోలు వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఉమేష్

జే.పంగులూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమతంగా ఉండాలని సీఐ ఆర్ ఉమేష్ అన్నారు. మండల పరిధిలోని పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం విలేజ్ విజిటింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై ఎస్సై తిరుమరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలియని నెంబర్ నుంచి ఫోను వచ్చినప్పుడు మనం ఓటీపీ చెప్పడం, ఏటీఎం సెంటర్లలో తెలియని వ్యక్తుల ద్వారా డ్రా చేయించడం వంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజుస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజలు చేస్తున్న కృష్ణచైతన్య

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండమూరు గ్రామంలో సోమవారం పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు కృష్ణచైతన్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కారంచేడు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు గ్రామాల వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో డీ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయుడువారిపాలెం బీసీ–ఏ, మహిళ–1, తిమిడెదపాడు బీసీ–ఏ జనరల్–1 పోస్టులకు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. అర్హత కలిగినవారు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి జూలై 3వ తేదీన నియామక పత్రాలు అందిస్తామన్నారు.